

# పసిడిమనసులు - షర్మిల



## ఏదయా నీ దయ రాదూ !

**పొద్దున్నే** పాటిమీద అరుగుల మీద కబుర్లు చెప్పుకునే వాళ్లు, ఇంకో పక్క ఆవాళ పేపర్ చదివే వాళ్లు, రాజకీయాలు మాట్లాడుకునే వాళ్లతో గందరగోళంగా వుంది .

నేను తెల్లారగట్టే మాస్టారి ఇంటిదగ్గర చదువుకుని ఇంటికి వస్తన్నా .

అంత గందరగోళంలోనూ ఒక గొంతు బొంగురుగా పెద్దగా వినిపిస్తాంది. అమ్మో ! ఇప్పుడు ఇటేపు నుంచే ఎళ్లాలి , ఆయన చూశాడా అంతేసంగతులు అనుకుంటా నక్కి నక్కి ఎళ్తా వుండగానే చూసేశాడు.

" ఏంటే ట్యూషన్ నుంచా?" అంటా ఆపేశాడు . ఆయన నాకు పెద్దనాన్న వరస అవుతారు. అందరూ "దయ" అంటారు.

అందరికీ ఆయన దయ ఏమో గానీ పిల్లలు మాత్రం ఆయన్ని చూస్తే దయ్యాన్ని చూసినట్టు జడుసుకుంటారు .

ఎందుకంటే ఆయన ఇంగ్లీష్ మాస్టరు కావడంతో అందరి ఎదురుగుండా స్పెల్లింగ్ లు అడుగుతాడు .

మొత్తానికి అందరిముందూ నన్ను నుంచోబెట్టాడు.

మా నాన్న కూడా అప్పుడు సెలవలు కావటంతో వూళ్లోనే వున్నారు. ఆయన వూరు వచ్చేది సంవత్సరానికి ఒకసారే .

అందరూ నేను బాగా చదువుతానని చెప్పటంతో దయ పెద్దనాన్నతో "అన్నయ్యా ! అమ్మడు చదువులో చాలా చురుకైందని నిన్నే మాస్టారు చెప్తున్నారు! క్లాస్ ఫస్ట్ అంట" అని చెప్తుంటే జరగబోయే తంతేంటో నాకు బాగా తెలుసు కాబట్టి బిక్క మొహమేసుకుని నుంచున్నాను.

" ఆ.. ఆ అదీ చూస్తా దీని చదువు ఏపాటిదో" అని స్పెల్లింగుల పరీక్ష మొదలెట్టాడు. అరుగులమీద అందరూ కబుర్లు ఆపేసి, పేపర్లు పక్కన పడేసి నన్నే చూస్తన్నారు.

మా నాన్న కూడా కూతురి తెలివితేటలు అందరికీ తెలుస్తాయన్న ఆనందంతో నన్నే చూస్తున్నారు. కానీ నేను వచ్చినయ్యి కూడా మర్చిపోతూ నత్తి నత్తిగా చెప్తున్నాను .

నాలెడ్జ్ స్పెల్లింగ్ చెప్పు అనడగగానే ఎన్ ఓ అని మొదలెట్టాను .

ఇక చూస్కోండి దయ పెదనాన్న "ఇదండీ చదువు ! ఆ మాస్టర్లు చెప్పే చదువులు ఇంతే ! నాలెడ్జ్ అనడగగానే ఎన్ అని మొదలెట్టింది. తప్పు చెప్పావు ఇందులో కె సైలెంట్, కె ఎన్ ఓ డబ్ల్యూ అంటా" దండకం మొదలెట్టాడు .

అందరి సంగతేమో గానీ మా నాన్న మొహం ఎర్రగా కందిపోతే, నా మొహం తెల్లబోయింది. మా గర్వభంగం జరిగిందన్న వుత్సాహంతో దయ పెద్దనాన్న మొహం వెలిగిపోయింది .

నేను ఏడుపు మొహం వేసుకుని ఇంటికి బయల్దేరాను .

ఇంటి దగ్గర సంక్రాంతి సెలవలికి వచ్చిన అత్తల పిల్లలతో సందడిగా వుంది. వెనకాల వచ్చిన నాన్న ఏం అనలేదుగానీ నాకు మాత్రం సిగ్గుగా అనిపించింది .

కాసేపటికి మా ఇంటికి దయ పెద్దనాన్న వస్తుండడం చూసి పిల్లలంతా కకావికలంగా ఒకళ్లు మంచాల వెనకాల, కొందరు వెనకాల వసారాలో నక్కారు .

మా బావ ఒకడు అప్పుడే లోపల నుంచి బయటకు వస్తా కనిపించాడు. అంతే అయిపోయాడు తనకి లెక్కల పరీక్ష మొదలెట్టాడు .

ఇట్టా కనిపించిన వాళ్లందరికీ యధాశక్తి పరీక్షలు పెట్టి అలిసిపోయి ఇంటికి బయల్దేరాడు.

వెళ్తా " రేపు బోగికి దేముడి వూరేగింపు కదా పిల్లంతా వూరేగింపులో వుండాలి తెలిసిందా " అని చెప్పి వెళ్లాడు.

ఇంకేమైనా అంటే ఇంకే పరీక్షలు పెడతాడో అని అందరం గంగిరెద్దుల్లాగా తలలూపాం.

మర్నాడు దేముడి ఊరేగింపు మొదలైంది.

ఊళ్లో కాస్త బలంగా వుండే వాళ్లు పల్లకీ మోస్తే ముందు వెలిగించిన కాగడా పట్టుకుని సముద్రుడు నడుస్తుంటే పక్కనే ఆచార్లు గారు ఇత్తడిపళ్లెం, శఠ గోపం పట్టుకొని పల్లకితో బయల్దేరారు .

ఈ వూరేగింపులో దయ పెద్దనాన్న పూనకం వచ్చినవాడిలా కళ్లు మూసుకుని గోవిందా అంటా కాసేపు, రాముడి భజనలు కాసేపూ చేస్తూ చిందులు తొక్కాడు .

ఊరేగింపులో నడిచే పిల్లల కాళ్లు తొక్కేస్తూ దయ పెద్దనాన్న గంతులతో మా ఊరి దేముడి ఊరేగింపు సందడి సందడిగా అయ్యింది . ఇంటికొచ్చి చిట్టెమ్మకి కందిపోయిన మా కాళ్లని చూపిస్తే కొబ్బరి నూనె రాస్తా "ఏంటో దయకి ఏమొచ్చినా పట్టలేం. మొన్న గుళ్లో దేముడికి నృత్యం ఇష్టమని తై తై అంటా గంతులేశాడు. నవ్వలేక కడుపు నెప్పి వచ్చింది " అని మళ్లీ తల్చుకుని నవ్వుకుంది.

మళ్లీ సారి పండగకి వచ్చిన మా అత్తయ్య పిల్లలు " అమ్మడూ మీ దయ పెద్ద నాన్న ఎక్కడా కనబడలేదు. ఒకేళ ఎక్కడ వస్తాడో అని ఊళ్లో తిరగటానికి బయమేస్తాంది " అన్నారు .

ఎప్పుడొచ్చాడో గాని దయ పెద్దనాన్న మా మాటలు విని "మీ అమ్మల, నాన్నలు నా దగ్గర ఇంగ్లీష్ పాఠాలు నేర్చుకున్నాళ్లేరా ... మిమ్మల్నే కాదు మీకు పుట్టబోయే పిల్లల్ని కూడా వదలను" అని

"మర్చిపోయా ! ఊరేగింపుకి అందరూ రావాలి" అని అనగానే అందరం మా కాళ్ల వంక బయ్యంగా చూసుకున్నాం.

*(వచ్చేనెల మరో కథ)*

Click here to share your comments